
సాక్షి
కుమురం భీం

ఆదివారం । 5 । నవంబర్ । 2023



మట్టి బతుకుల్లో దీపాల కాంతులు

తరతరాలుగా కుమ్మరుల జీవితాలు మట్టిలోనే మగ్గుతున్నాయి. కులవృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న వీరికి ప్రభుత్వ ఆదరణ కరువైంది. 11లో▸

10న ఆర్‌ఎస్పీ నామినేషన్

కాగజ్‌నగర్‌టౌన్: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు, సిర్పూర్ బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ ఈ నెల 10న నామినేషన్ వేయనున్నట్లు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్, రాష్ట్ర కార్యదర్శి గణపతి తెలిపారు. 10న పట్టణంలోని పార్టీ ఆఫీస్ నుంచి బాలాజీనగర్, అంబేద్కర్ విగ్రహం, రాజీవ్ చౌక్, ఎన్టీఆర్ చౌక్ గుండా సిర్పూర్(టి) వరకు ర్యాలీ ఉంటుందని పేర్కొన్నారు.

గరిష్టం/కనిష్టం
33.0 /21.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. వాతావరణం పొడిగా ఉంటుంది. చలి కాస్త తగ్గుతుంది. రాత్రివేళ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

రెండోరోజు నామినేషన్లు నిల్

ఆసిఫాబాద్/సిర్పూర్(టి): అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా రెండోరోజు శనివారం ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని రిటర్నింగ్ అధికారి వేణు తెలిపారు. సిర్పూర్ నియోజకవర్గం నుంచి కూడా ఒక్క నామినేషన్ దాఖలు కాలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి దీపక్ తివారి పేర్కొన్నారు.

నూతన నియామకం

లింగాపూర్: మండల కేంద్రానికి చెందిన జాదవ్ ధర్మేందర్ షెడ్యూల్ తెగల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. గిరిజన జాతిపై జరిగే అన్యాయాలపై సంఘం ఆధ్వర్యంలో పోరాడుతానని ఈ సందర్భంగా ధర్మేందర్ పేర్కొన్నారు.

సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

కాగజ్‌నగర్‌టౌన్: ఈ నెల 8న సీఎం కేసీఆర్ కాగజ్‌నగర్ పర్యటన నేపథ్యంలో శనివారం బహిరంగ సభ ఏర్పాట్లను సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు పరిశీలించారు. స్థానిక పేపర్ మిల్లు క్రీడా మైదానంలో జరగనున్న సీఎం సభ కోసం సభాస్థలితో పాటు ఇతర ఏర్పాట్ల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు వీవీ ప్రసాద్, నాయకుడు కట్ట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొండపల్లిలో కార్డన్ సెర్చ్



మాట్లాడుతున్న డీఎస్పీ కరుణాకర్

పెంచికల్‌పేట్: మండలంలోని కొండపల్లి గ్రామంలో కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో శనివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనంతరం ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ.. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకూడదని సూచించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుపై శ్రద్ధపెట్టాలని పేర్కొన్నారు. గ్రామాల్లో నాటుసారా తయారు చేసినా, విక్రయించినా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా గ్రామస్తులు సహకరించాలని చెప్పారు. అంతకుముందు గ్రామంలో ప్రతీ ఇంటిని తనిఖీ చేసి ద్విచక్రవాహనాల ధ్రువీకరణపత్రాలు పరిశీలించారు. ఆయన వెంట కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు, ఎస్సై కొమురయ్య, పోలీసు సిబ్బంది ఉన్నారు.

'తరగతులకు హాజరు కావాలి'

కాగజ్‌నగర్‌టౌన్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ప్రస్తుత సెకండ్, థర్డ్ ఇయర్ డిగ్రీ విద్యార్థులకు తరగతులు ఈ నెల 5వ తేదీ నుంచి స్థానిక ఎస్‌కేఈ డిగ్రీ కళాశాలలో ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులు హాజరు కావాలని స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ దత్తాత్రేయ కోరారు. అలాగే ప్రస్తుతం డిగ్రీ చదువుతున్న సైన్స్ విద్యార్థులు ఫస్ట్ ఇయర్ సెమిస్టర్-2, సెకండ్ ఇయర్ సెమిస్టర్-4 విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 6నుంచి ఆదిలాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రారంభమవుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు తప్పనిసరిగా హాజరుకావాలని, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి సంబంధించిన ఇతర వివరాలకు 9866398678 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

రెబ్బెన: మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో శనివారం రెబ్బెన తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీ రూరల్ ఫోక్ ఆర్ట్స్ ఆర్గనైజేషన్ కళాజాత సభ్యులు బ్యాంక్ ద్వారా ఖాతాదారులకు అందజేస్తున్న పథకాలు, రుణాలపై పాటలు, నాటికల ద్వారా అవగాహన కల్పించారు. ఫీల్డ్ అధికారులు సునీత, గోగికార్ నరేశ్, ప్రిన్సిపాల్ జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆయోగ్

- తిర్యాణి మండల అభివృద్ధికి చర్యలు
- వెనుకబడ్డ ప్రాంతంగా గుర్తింపు
- తొమ్మిది రంగాల్లో అభివృద్ధికి ప్లాన్
- ఆరు నెలలకోసారి సమీక్షా సమావేశం
- పనుల పర్యవేక్షణకు ప్రత్యేక టీం



గంభీరావుపేట గ్రామసభలో చర్చిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు (ఫైల్)

తిర్యాణి మండల సమాచారం

పంచాయతీలు: 29,
గ్రామాలు: 134, జనాభా: 34,716

పాఠశాలలు: 70, విద్యార్థులు: 3,303

ఆస్పత్రులు: పీహెచ్‌సీలు-3
సబ్ సెంటర్లు-10

సాగు భూమి: 24,241 ఎకరాలు
క్లస్టర్లు: 5, రైతులు: 8,255
ప్రధాన పంటలు: పత్తి, వరి, కంది

ప్రధాన ప్రాజెక్టులు: ఎన్టీఆర్ సాగర్ (చెలిమల) ప్రాజెక్ట్, దోర్లుల వాగు ప్రాజెక్ట్

తిర్యాణి: ఇప్పటికీ అభివృద్ధి చెందని ప్రాంతాల్లో పౌరుల జీవన నాణ్యతను మెరుగుపరిచేందుకు నీతి ఆయోగ్ దృష్టి సారించింది. అన్ని రంగాల్లో ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు దేశంలోని 500 బ్లాక్ (మండలం)లను గుర్తించింది. ఇందులో తిర్యాణి మండలానికి చోటు దక్కింది. ప్రధానంగా ఎంపికైన బ్లాక్‌లలో గ్రామాలాభివృద్ధికి అధికారులనే నాయకులుగా గుర్తించి సమగ్రాభివృద్ధికి చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఇప్పటికే క్షేత్రస్థాయిలో అధికారులు గ్రామసభలు నిర్వహించి వివిధ రంగాల్లో అభివృద్ధి కావాల్సిన అంశాలపై ప్రజలతో చర్చించారు. అధికారులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఇటీవల దేశ రాజధాని ఢిల్లీలో ప్రధాని మోదీ నిర్వహించిన సమావేశానికి మండలానికి చెందిన ఐదుగురు ప్రజాప్రతినిధులు, మండల పంచాయతీ అధికారి కూడా హాజరయ్యారు.

క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ

మండలాభివృద్ధికి తీసుకున్న ప్రణాళికలు అమలు చేయడంతో పాటు బ్లాక్ లెవల్ అధికారుల టీమ్ నిత్యం పనులపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. అయితే అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది. అవసరమైన సమయంలో కొన్ని ప్రత్యేక నిధులు కూడా ఖర్చు చేసి అభివృద్ధి చేసేందుకు ఆస్కారం ఉంటుంది. వీటితో పాటు సంక్షేమ పథకాలను సక్రమంగా వినియోగించుకోవడం, ఆర్థిక పురోగతికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ తద్వారా వారి సమగ్ర అభివృద్ధికి తోడ్పాటునందించడం లాంటి బాధ్యతను బ్లాక్ లెవల్ అధికారుల బృందం తీసుకుంటుంది. ఈ బ్లాక్‌లెవల్ అధికారుల బృందానికి కలెక్టర్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. క్షేత్రస్థాయిలో చేపడుతున్న పనులపై బ్లాక్ లెవల్ అధికారులతో నిత్యం సమీక్షా సమావేశం నిర్వహిస్తుంటారు. అయితే ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలు చేయడం, ప్రభుత్వం నుంచి వస్తున్న నిధులు వెనక్కి వెళ్లకుండా చూడటం, పథకాల అమలులో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే పరిస్థితులకు అనుగుణంగా కొంత వెసులుబాటు కల్పించి పక్కాగా అమలు చేయడం లాంటి చర్యలు చేపట్టేందుకు వీలుంటుంది.

తొమ్మిది రంగాలపై దృష్టి

ఆరోగ్యం, పోషకాహారం, విద్య, వ్యవసాయం, బేసిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, తాగునీరు, పరిసరాల పరిశుభ్రత, ఆర్థికాభివృద్ధి, సోషల్ డెవలప్‌మెంట్ అంశాలపై నీతి ఆయోగ్ దృష్టి సారించింది. చేపట్టిన అభివృద్ధి పనుల్లో అంతరాయం ఏర్పడకుండా ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తూ ఉంటారు. ప్రతీ ఆరు నెలలకోసారి క్షేత్రస్థాయిలో చేపడుతున్న పనులపై సమీక్షా సమావేశం కూడా నిర్వహిస్తారు. ప్రజల భాగస్వామ్యంతో రాష్ట్ర అభివృద్ధిలో సగటును దాటాలనే లక్ష్యంతో అధికారులు పనులు చేపట్టనున్నారు. సమగ్ర అభివృద్ధిని వందశాతంగా తీసుకుంటే అందులో ఆరోగ్యం 30 శాతం, విద్య 30 శాతం, వ్యవసాయం 20శాతం, బేసిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 20శాతం, సోషల్ డెవలప్‌మెంట్ 5 శాతంగా చూడనున్నారు. వచ్చే రెండు ఏళ్లలోపు మండలాన్ని పైన పేర్కొన్న అంశాల్లో రాష్ట్ర సగటు కన్నా ఒక్క శాతమైనా అధికంగా ఉండేలా లక్ష్యం విధించుకున్నారు.

సమగ్రాభివృద్ధికి పాటుపడతాం



నీతి ఆయోగ్ ద్వారా మండల సమగ్ర అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై మాకు శిక్షణ ఇచ్చారు. వ్యవసాయ రంగంలో కావాల్సిన అభివృద్ధికి సంబంధించి ఇప్పటికే క్షేత్రస్థాయిలో గ్రామసభలు నిర్వహించి రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నాం.

– తిరుమలేశ్వర్, ఏవో, బ్లాక్‌లెవల్ ఆఫీసర్ టీం సభ్యుడు

ప్రజలు భాగస్వాములు కావాలి



మండలాన్ని అత్యంత వెనుకబడిన బ్లాక్‌గా నీతి ఆయోగ్ గుర్తించడం శుభ సూచకం. ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని ఎలా అభివృద్ధి చెందాలనే అంశంపై ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన మండలానికి చెందిన ప్రజాప్రతినిధుల బృందంతో సమావేశం నిర్వహించారు. అందులో నేనున్నాను. అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేసేందుకు కృషి చేస్తాం.

– మడావి గుణవంత్‌రావు, సర్పంచ్, కొటగాం

బీఆర్‌ఎస్‌లో చేరిన సరస్వతి



మంత్రి కేటీఆర్‌తో సరస్వతి, కోవ లక్ష్మి, ఆత్రం సక్కు

- కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి కేటీఆర్

ఆసిఫాబాద్: కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశించి భంగపడ్డ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆసిఫాబాద్ మాజీ సర్పంచ్ మర్సుకోల సరస్వతి శనివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ హైదరాబాద్‌లో ఆమెకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఆమె కేటీఆర్ హామీతో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆమెతో పాటు తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య కూడా గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్, బీఆర్‌ఎస్ ఆసిఫాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి అరిగెల నాగేశ్వర్‌రావు సమక్షంలో వీరు గులాబీ గూటికి చేరారు. కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశిస్తూ మూడేళ్లుగా సరస్వతి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. ఆదివాసీలతో మమేకమయ్యారు. జిల్లాలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించే పలు కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. కాగా, ఆసిఫాబాద్ టికెట్ శ్యాంనాయక్‌కు ఇవ్వగా తీవ్ర నైరాశ్యానికి గురయ్యారు. ఈ క్రమంలో కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. భవిష్యత్ ప్రణాళికపై తర్జనభర్జన పడ్డారు. తొలుత బీజేపీ వైపు మొగ్గు చూపినా చివరకు బీఆర్‌ఎస్ గూటికి చేరారు.

అక్క చెంతకు చేరిన చెల్లెలు

మర్సుకోల సరస్వతి చివరికి అక్క కోవ లక్ష్మి చెంతకు చేరారు. సరస్వతి రాకతో కోవ లక్ష్మికి గోండు సామాజిక వర్గానికి చెందిన ఓట్లు చీలిపోకుండా ప్లస్ పాయింట్‌గా మారే అవకాశాలున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసిన సరస్వతి 25,439 ఓట్లు సాధించి మూడో స్థానంలో నిలువగా టీఆర్‌ఎస్ నుంచి కోవ లక్ష్మి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అక్కా, చెల్లెలు ఒకే గూటికి చేరడం బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా మారింది. కాగా, తెలంగాణ ఉద్యమకారులు నైరాశ్యంలో ఉన్నారు. పార్టీలో తమకు సముచిత స్థానం కల్పించడం లేదన్న అభిప్రాయం వ్యక్తంజేస్తున్నారు.

'స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటా'

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ ఎమ్మెల్యేగా స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటానని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు భుక్యా గోవింద్‌నాయక్ స్పష్టం చేశారు. శనివారం జైనూర్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వైఎస్సార్‌టీపీ ఎన్నికల బరి నుంచి తప్పుకొంటున్నట్లు పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల ప్రకటించగా.. నియోజకవర్గ అభివృద్ధి, తనను నమ్ముకుని వెంట ఉన్న కార్యకర్తలకు న్యాయం చేసేందుకు పోటీ చేస్తానని చెప్పారు. ఆయన వెంట వివిధ మండలాల నాయకులు నాగోరావ్, షేక్ అతిక్యార్నార్, అల్లసింగ్, ఖాన్, హన్మంతు, కార్యకర్తలు తదితరులున్నారు.

'ఎన్నికల మేనిఫెస్టోలో డిమాండ్లు చేర్చాలి'

కాగజ్‌నగర్‌టౌన్: వివిధ రంగాల్లోని కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, వారి డిమాండ్లను ఆయా రాజకీయ పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు అంబాల ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ పరిశీలకుల నియామకం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గాల ఏఐసీసీ పరిశీలకులు, ఏఐసీసీ క్లస్టర్ ఇన్‌చార్జీలను నియమించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు పరిశీలకులను ప్రకటించింది. ఏఐసీసీ అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులుగా చెన్నూర్‌కు బి.దేవేంద్రప్ప, బెల్లంపల్లికి శ్రీనివాస్ ఎన్వీ, ఆసిఫాబాద్‌కు జీఎస్.గణేశ్, ఆదిలాబాద్‌కు ఆర్.రాజేంద్రను నియమిస్తూ ఆ పార్టీ జనరల్ సెక్రెటరీ కేసీ వేణుగోపాల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

జైలు జీవితంతో ఖైదీల్లో పరివర్తన రావాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్



సమావేశానికి హాజరైన ఖైదీలు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్
- స్పెషల్ సబ్‌జైలులో ఘనంగా లీగల్ సర్వీసెస్ అథారిటీ దినోత్సవం

ఆసిఫాబాద్: జైలు జీవితంతో ఖైదీల్లో పరివర్తన రావాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ ఎంవీ రమేశ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని స్పెషల్ సబ్ జైలులో శనివారం నిర్వహించిన లీగల్ సర్వీసెస్ అథారిటీ దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్షణికావేశంలో చేసిన తప్పులతో ఒక కుటుంబం రోడ్డున పడుతుందని తెలిపారు. జైలులో నేర్చుకున్న మంచి లక్షణాలు నిత్య జీవితంలో అలవర్చుకోవాలని సూచించారు. నేర ప్రవృత్తితో సమాజంలో గుర్తింపు కోల్పోయే ప్రమాదం ఉంటుందని తెలిపారు. ఖైదీలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కక్షిదారులు కూర్చుని మాట్లాడుకుంటే అనేక అంశాలకు పరిష్కారాలు దొరుకుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ మెడిటేషన్ చేయడం అలవాటు చేసుకోవాలని, దీంతో పనిపై శ్రద్ధ పెరిగి తప్పులు చేసే అవకాశం తగ్గుతుందన్నారు. మంచి, చెడులను బేరీజు వేసుకునే శక్తి వస్తుందని తెలిపారు. అంతకుముందు జైలు సిబ్బంది జిల్లా ప్రధాన న్యాయమూర్తికి ఘనస్వాగతం పలికారు. జైలర్ ప్రేమ్‌కుమార్, న్యాయవాదులు చంద్రకుమార్, నరహరి, గణేశ్, రాజీవ్‌రెడ్డి, లీగల్ అసిస్టెంట్, అంజనీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో 'కార్తీక' పూజలు



శివాలయంలో అభిషేకం చేస్తున్న మహిళలు



శివునికి హారతి ఇస్తున్న మహిళలు

- కొనసాగుతున్న కాకడ హారతి
- శివాలయంలో భక్తుల రద్దీ

కెరమెరి: హిందూ సంస్కృతిలో కార్తీక మాసానికి ప్రత్యేక స్థానం ఉంది. శివ, వైష్ణవ, శక్తి, ఆరాధనకు ఈ నెల ప్రసిద్ధి. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని శివాలయం భక్తులతో కళకళలాడుతోంది. దీంతో మండల కేంద్రంలో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడుతోంది. శనివారం శివాలయం భక్తులతో కిక్కిరిసింది. స్థానిక శివాలయంలో పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకుని కాకడ హారతి, భజనలు కొనసాగుతున్నాయి. మహిళలు, పురుషులు, చిన్నారులు అనే తేడా లేకుండా ఉదయం నాలుగు గంటలకే శివాలయం చేరుకుంటున్నారు. సుమారు గంట సేపు భజన చేస్తున్నారు. మంగళహారతులు, ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్నారు. నైవేద్యం సమర్పిస్తున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్నారు.

బస్టాండ్ నిర్మించేదెప్పుడో!

- సిర్పూర్‌లో ప్రయాణికుల పాట్లు
- రోడ్లపైనే బస్సుల కోసం నిరీక్షణ
- మహిళల పరిస్థితి వర్ణనాతీతం



సిర్పూర్(టి)-కౌటాల ప్రధాన రహదారిపై బస్సులు నిలిపేస్థలం



బస్టాండ్‌కు కేటాయించిన స్థలంలో తాత్కాలిక షెడ్డు

సిర్పూర్(టి): నియోజకవర్గ కేంద్రమైన సిర్పూర్(టి)లో బస్టాండ్ లేక దశాబ్దాలుగా ప్రయాణికులు నానా పాట్లు పడుతున్నారు. నియోజకవర్గ కేంద్రం కావడంతో ఇక్కడికి నిత్యం ఆయా గ్రామాల ప్రజలు వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. సమీప మహారాష్ట్రలోని వివిధ గ్రామాలవారు కూడా నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఇక్కడ బస్టాండ్ లేక అసౌకర్యానికి గురవుతున్నారు. సిర్పూర్(టి)-కౌటాల, సిర్పూర్(టి)-మాకిడి ప్రధాన రహదారుల కూడలి వద్ద బస్టాండ్ నిర్మాణానికి 2003లో అప్పటి ప్రజాప్రతినిధులు రూ.5లక్షలు మంజూరు చేసి శిలాఫలకం వేశారు. కానీ.. నేటికీ పనులు ప్రారంభించలేదు. అనంతరం సిర్పూర్(టి) గ్రామపంచాయతీ నిధులతో బస్టాండ్ నిర్మాణ స్థలంలో వ్యాపార సముదాయ భవన నిర్మాణం చేపట్టారు. దీంతో సరిపడా స్థలం లేక బస్టాండ్ నిర్మాణం చేపట్టలేదు. ఐదేళ్ల క్రితం బస్టాండ్ నిర్మాణానికి స్థానిక బీసీ బాలుర వసతి గృహం స్థలాన్ని కేటాయించి తాత్కాలికంగా షెడ్డు ఏర్పాటు చేశారు. నూతన బస్టాండ్ నిర్మాణ పనులు కూడా ప్రారంభిస్తామని నేటికీ ప్రారంభించలేదు. ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తంజేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి మండలకేంద్రంలో బస్టాండ్ నిర్మాణం చేపట్టి ప్రయాణికులు, ప్రజల ఇబ్బందులు తీర్చాలని కోరుతున్నారు.

తాత్కాలిక షెడ్డుతో సరిపెట్టారు



మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట బస్టాండ్ నిర్మిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు తాత్కాలిక షెడ్డు వేసి వదిలేశారు. ఏళ్లు గడుస్తున్నా బస్టాండ్ నిర్మాణం చేపట్టలేదు. దీంతో ఇబ్బందులు తప్పడంలేదు.

– గణేశ్, ప్రయాణికుడు

బస్టాండ్ నిర్మాణం చేపట్టాలి



మండలకేంద్రంలో బస్టాండ్ నిర్మాణం చేపట్టాలి. బస్టాండ్ లేకపోవడంతో ప్రతిరోజూ మండలకేంద్రానికి వచ్చే ప్రజలతో పాటు నియోజకవర్గ ప్రజలు, మహారాష్ట్ర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

– నులిగొండ రాజశేఖర్, ప్రయాణికుడు

మహిళల బాధలు వర్ణనాతీతం



మండల కేంద్రానికి వచ్చే మహిళలు స్థానిక బస్టాండ్ ప్రాంతంలో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో వారు పడే ఇబ్బందులు వర్ణనాతీతం. వెంటనే అన్ని వసతులతో బస్టాండ్ నిర్మించి సమస్య పరిష్కరించాలి.

– లక్ష్మణ్, ప్రయాణికుడు

నిధులు మంజూరైనా..



మండలకేంద్రంలో బస్టాండ్ నిర్మాణానికి 2003లో నిధులు మంజూరయ్యాయి. శిలాఫలకం వేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు నేటికీ నిర్మాణం ప్రారంభించలేదు. వెంటనే బస్టాండ్ నిర్మించి ఇక్కట్లు తొలగించాలి.

– అనిల్, ప్రయాణికుడు

'చలో హైదరాబాద్' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సిర్పూర్(టి): హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఈనెల 11వ తేదీన నిర్వహించనున్న మాదిగ ఉపకులాల విశ్వరూప మహాసభ పోస్టర్‌ను శనివారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లును తక్షణమే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో మహాసభ నిర్వహిస్తున్నామని, ప్రధాని నరేంద్రమోదీ హాజరవుతారన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండా బ్రహ్మయ్య మాదిగ, జిల్లా కోఆర్డినేటర్ సత్యనారాయణ, మండలాధ్యక్షుడు అశోక్, ఎమ్మార్పీఎస్ నాయకులు లింగమూర్తి, శ్రీనివాస్, ఇప్ప రవిశంకర్, ప్రసాద్, తిరుపతి, మహేశ్, దేవేందర్, శ్రీశైలం, ప్రవీణ్‌కుమార్, దివాకర్, భాస్కర్, సాయినాథ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అదృశ్యమైన మహిళ మృతి



లలిత(ఫైల్)

జైపూర్: మండలంలోని ఇందారం గ్రామంలో అదృశ్యమైన పిన్న లలిత మృతిచెందింది. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె 15రోజుల క్రితం మతిస్థిమితం కోల్పోయింది. రెండ్రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోగా కుటుంబ సభ్యులు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బంధువుల ఇళ్లలో ఆరా తీసి సోషల్ మీడియాలో పోస్టులు చేయగా కరీంనగర్ బస్టాండ్‌లో దిగినట్లుగా సమాచారం అందడంతో కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని ఆచూకీ కోసం గాలించారు. శనివారం కరీంనగర్ ఎల్ఎండీ డ్యాంలో స్థానికులు లలిత(68) మృతదేహాన్ని గుర్తించారు. ఆమెకు భర్త సమ్మయ్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు.

ఎక్సైజ్ దాడుల్లో గుడుంబా ధ్వంసం



సింగిల్‌గూడలో బెల్లం పానకం ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

ఆసిఫాబాద్: రెబ్బెన మండలంలోని రాళ్లపేట, సింగిల్‌గూడలోని గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. రాళ్లపేటలో విక్రయిస్తున్న 5 లీటర్ల గుడుంబా పట్టుకోవడంతో పాటు గ్రామ పరిసరాల్లో తయారు చేస్తున్న 800 లీటర్లు, సింగిల్‌గూడలో 700 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. దాడుల్లో 5 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతి కిరణ్ తెలిపారు. దాడుల్లో ఎస్సై విజయలక్ష్మి, హెడ్ కానిస్టేబుల్ ధర్మా ప్రకాశ్, కానిస్టేబుళ్లు మహేశ్, మమత పాల్గొన్నారు.

అడవిపందుల దాడిలో పంట ధ్వంసం



కొత్త మద్దిపడగలో ధ్వంసమైన వరి పంట

కడెం: మండలంలోని కొత్త మద్దిపడగ గ్రామానికి చెంది దుల్లె వెంకటేశ్ వరి పంటపై శుక్రవారం రాత్రి అడవి పందులు దాడి చేశాయి. మూడు ఎకరాలు సాగు చేస్తే, పందుల దాడిలో సుమారు ఎకరం మేర పంట ధ్వంసమైందని బాధిత రైతు తెలిపాడు. పగలు కోతులు, రాత్రిళ్లు వన్యప్రాణులతో నష్టపోతున్నామని, ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం చెల్లించాలని కోరాడు.

సబ్సిడీపై సోలార్ యూనిట్లు

- స్త్రీనిధి ద్వారా రుణాలు మంజూరు
- మహిళా సంఘాల సభ్యుల ఆసక్తి
- వాయిదాల్లో రుణం చెల్లించే వెసులుబాటు



ఇంటిపై సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకున్న మహిళా సంఘం సభ్యురాలు

పాతమంచిర్యాల: స్వయం సహాయక సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం సోలార్ యూనిట్లు అందిస్తోంది. గ్రామీణాభివృద్ధిశాఖ సెర్ప్ ఆధ్వర్యంలో మహిళా సభ్యులకు వీటిని పంపిణీ చేస్తోంది. ఇందుకోసం స్త్రీనిధి ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తోంది. జిల్లాలో 2 కిలోవాట్, 3 కిలోవాట్ సామర్థ్యం కలిగిన ఈ ప్లాంట్ల ఏర్పాటుకు సభ్యులు ఆసక్తి చూపుతున్నారు. ఇంటి దాబాలపై వీటిని ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ ఖర్చు తగ్గించుకోవడం, ఆదా చేసుకోవడంపై దృష్టిపెట్టారు. జిల్లాలో భీమిని మండలం మల్లిడి గ్రామంలో ఇప్పటికే 3 సోలార్ యూనిట్లు ఏర్పాటు కాగా, మంచిర్యాలలోని సున్నంబట్టివాడలో ఒక యూనిట్ ఏర్పాటు చేశారు. భీమిని మండలంలో మరో 5 యూనిట్లు, జిల్లా కేంద్రంలో మరో మూడు యూనిట్లు ఏర్పాటు కానున్నాయి. 3 కిలోవాట్ సోలార్ యూనిట్ ధర రూ.2.64 లక్షలు కాగా, ప్రభుత్వం రూ.43 వేల వరకు సబ్సిడీ భరిస్తుంది. లబ్ధిదారులు రూ.1.69 లక్షలు రుణంగా ఐదేళ్ల సులభ వాయిదాలు నెలకు రూ.3500 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. సోలార్ ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్‌ను ఇంటి అవసరాలకు వినియోగించుకుని మిగిలినది విద్యుత్ సంస్థలకు అమ్ముకునే అవకాశం ఉంది. ఇందుకోసం ప్లాంట్ ఏర్పాటు సమయంలో నెట్ మీటర్, గ్రిడ్‌మీటర్ అనే రెండు మీటర్లు ఏర్పాటు చేస్తున్నారు. 3 కిలోవాట్ల సోలార్‌ప్లాంట్ రోజుకు 10 యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తే 30 రోజులకు 300 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. ఇంటి అవసరాల నిమిత్తం నెలకు 100 యూనిట్లు వినియోగించుకుంటే మిగిలిన 200 యూనిట్లు గ్రిడ్‌కు అమ్ముకోవచ్చు. విద్యుత్ సంస్థ నిర్ణయించిన యూనిట్ రేట్లను లబ్ధిదారులకు చెల్లిస్తారు. రెడ్‌కో సంస్థ ప్లాంట్‌ను 20 ఏళ్ల గ్యారంటీతో ఏర్పాటు చేస్తున్నారు. ఎలాంటి మరమ్మతు వచ్చిన పూర్తి బాధ్యతను సోలార్ యూనిట్ తయారీదారులదే బాధ్యత. దీంతో మహిళా సంఘాల సభ్యులు సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుపై ఆసక్తి కనబరుస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

సోలార్ ప్లాంట్ల ఏర్పాటుపై మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్లాంట్ల ఏర్పాటుకు సబ్సిడీ రుణం మంజూరు చేస్తోంది. విద్యుత్ ఆదాతోపాటు విద్యుత్ ఉత్పత్తిపై ఆదాయం వస్తుందనే విషయాలు వివరిస్తున్నాం. – వెంకటరమణ, స్త్రీనిధి ప్రాంతీయ మేనేజర్, డీఆర్‌డీఏ, మంచిర్యాల

మామిడిలో సస్యరక్షణ చర్యలు

- జిల్లాలో 18వేల ఎకరాల్లో మామిడి సాగు
- యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు

చెన్నూర్‌రూరల్: జిల్లాలో మా మిడి సాగుపై ఎందరో రైతులు ఆధారపడి జీవిస్తున్నారు. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా సుమారు 18వేల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని హెచ్‌వో తిరుపతి వివరించారు. ఈ నెల ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని, ఇప్పటి నుంచి నాలుగు నెలల కాలం మామిడి పంటకు కీలకమని పేర్కొన్నారు. రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. నవంబర్ నెల నుంచి నీరుపెట్టడం పూర్తిగా ఆపేయాలి. లేదంటే చెట్టు శాఖీయంగా బాగా పెరగడంతోపాటు పూత రావడం ఆలస్యం అవుతుంది. పూత రావడం అనేది రాత్రి పూట చల్లని వాతావరణం, పగటి పూట ఉన్న ఎక్కువ ఉష్ణోగ్రతలపై ఆధారపడి ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రత కనీసం 13డిగ్రీల సెంటీగ్రేడ్ చేరుకునేలా కనీసం 15 రోజులపాటు కొనసాగితే పూత వస్తుంది, వాతావరణ పరిస్థితులు కొమ్మల్లోని హార్మోన్ల నిష్పత్తి కొమ్మకు తగినంత వయసు అనేది పూత రావడానికి ప్రధాన పాత్ర పోషిస్తుంది.

పూత బాగా రావాలంటే...

పూత బాగా రావాలంటే కొత్తగా వచ్చే చిగుర్లపై 5 గ్రాములు జింక్ సల్ఫేట్, 2 గ్రాములు బోరాక్స్, 10 గ్రాముల యూరియాను ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.



తిరుపతి, హెచ్‌వో

తోటలను చీడపీడల నుంచి కాపాడుకోవాలి

ఈ నెల నుంచి మామిడి తోటల్లో తేనె మంచు పురుగు, తామర పురుగు, బూడిద తెగులు లేత కొమ్మలను ఆశించి నష్ట పరుస్తాయి. తేనె మంచు పురుగు తల్లి, పిల్ల పురుగు లేత ఆకులు, పూల కొమ్మలపై గుంపులు, గుంపులుగా చేరి రసం పీల్చుతాయి. దీంతో కాడలు, కొమ్మలు మాడిపోయి, ఎండిపోయి, పూత, పిందె ఏర్పడదు. ఒకవేళ ఏర్పడినా బలహీన పడతాయి. ఈ పురుగు తేనే లాంటి పదార్థాలను విసర్జించడం వల్ల శిలీంద్రాలు ఆకర్షింపబడి కాడలు, ఆకులపై మసి లాంటి పొర ఏర్పడి కిరణజన్య సంయోగ క్రియ జరగదు. దీంతో చెట్టుకు కావాల్సిన పోషకాలు అందవు. దీని నివారణ కోసం ఈ మాసంలో కార్బాలిల్ 3గ్రాములు, ఆర్థిన్ 1గ్రాము, నువాన్ ఒక మిల్లీలీటరు, 5 మిల్లీలీటర్ల వేపనూనె, కార్బండిజమ్ ఒక గ్రాము లేదా మ్యాంకోజెబ్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి చెట్టు, కాండం కొమ్మల నుంచి ఆకులు తడిసేలా పిచికారీ చేయాలి. తామర పురుగు లేత కొమ్మలను ఆశించి రసం పీల్చడం ద్వారా కొమ్మలు రాతి రంగుకు మారి మాడిపోతాయి. దీని నివారణకు రీజెంట్ 2మిల్లీలీటర్లు, ఎసిఫేట్ 1.5 గ్రాములను లేత కొమ్మలు, ఆకులపై పిచికారీ చేయాలి.



మామిడి చెట్లు

తెగులును నివారించాలి

ఈ మాసంలో బూడిద తెగులు పూల కొమ్మలను ఆశించి నష్ట పరుస్తుంది. తెల్లని బూడిద లాంటి పొడి ఆకులు, పూత కాడలపై కనిపిస్తుంది. చలి ఎక్కువైన పరిస్థితుల్లో తెగులు తీవ్రమవుతుంది. తెగులు సోకిన భాగాలు నల్లగా మారిపోతాయి. ఆకులు, పూలకాడలు సక్రమంగా పెరగవు. ఈ తెగులు వల్ల పంటకు 30 నుంచి 60శాతం వరకు పంట నష్టం కలుగుతుంది. దీని నివారణకు మూడు గ్రాములు నీటిలో కరిగే గంధకం(సల్ఫర్)ను పువ్వు వచ్చే కాడలు, కొమ్మలు తడిచేలా పిచికారీ చేయాలి. హెక్సాకొనజోల్ మందును 2 మిల్లీలీటర్లు తీసుకొని లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. నవంబర్ నెలలో మామిడి తోటకు బెట్ట పరిస్థితులు కల్పిస్తూ సస్యరక్షణ చర్యలతో తోటల్లో అధిక పూత పొందవచ్చు.

'చందాల రికవరీకి సంబంధం లేదు'

శ్రీరాంపూర్: తమ యూనియన్ పేరుతో కార్మికుల బ్యాంక్ ఖాతాల నుంచి రికవరీ అవుతున్న డబ్బులకు, సీఐటీయూకు ఎలాంటి సంబంధం లేదని ఆ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచీ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, కార్యదర్శి గోదారి భాగ్యరాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మందమర్రి ఏరియాలో యూనియన్ బ్యాంక్‌లో అకౌంట్ ఉన్న కార్మికుల్లో కొందరికి తమ యూనియన్ చందా పేరుతో రూ.500లు రికవరీ అవుతున్నాయన్నారు. దీనికి తమ యూనియన్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఈ రికవరీ అయిన డబ్బులకు సంబంధించి యూనియన్ బ్యాంక్‌లో ఖాతా ఉన్న సదరు కార్మికుల నుంచి తాము ఎలాంటి రికవరీ కోరలేదన్నా రు. కావున కార్మికులు గమనించాల్సిందిగా తెలి పారు.

రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థి ప్రతిభ

బెల్లంపల్లి: ప్రతిష్టాత్మక అగాఖాన్ అకాడమీలో ప్రవేశం కోసం రాష్ట్రస్థాయిలో నిర్వహించిన టాలెంట్ టెస్టులో బెల్లంపల్లి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్‌ఎక్సలెన్సీ(సీఓఈ) విద్యాలయం విద్యార్థి నిచ్చకోల రుషికేష్ ప్రతిభ చాటాడు. శనివారం గురుకులంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సీఓఈ ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, వైస్ ప్రిన్సిపాల్ కోట రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు. రుషికేష్‌ను గురుకులాల జాయింట్ సెక్రెటరీ కంభంపాటి శారద, ఆర్సీఓ కొప్పుల స్వరూపారాణి ఫోన్ చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వర్, హారిక, స్రవంతి, తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ పరిజ్ఞానం పెంచుకోవాలి

నిర్మల్ రూరల్: విద్యార్థులు చదువుతో పాటు శాస్త్ర, సాంకేతికతలపై పరిజ్ఞానం పెంపొందించుకోవాలని జిల్లా సైన్స్ అధికా రి వినోద్‌కుమార్ సూచించారు. జిల్లా కేంద్రంలోని జీజీఎస్ఆర్ ఉన్నత పాఠశాలలో శనివారం సైన్స్ డ్రామా ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సైన్స్‌పై విద్యార్థులు మక్కువ పెంచుకోవాలన్నారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొని నాటికలు ప్రదర్శించారు. 'మానవ జాతి ప్రయోజనం కోసం శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం' అనే అంశంపై పోటీలు నిర్వహించారు. మూఢ నమ్మకాలు జీవితాన్ని ఏ విధంగా ప్రభావం చేస్తాయో, ఏ రకంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో విద్యార్థులు వివరించారు. చిరుధాన్యాల ఆవశ్యకత వాటిని తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి వచ్చే ప్రయోజనాలు, మానవ జీవితంలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం యొక్క ఉపయోగం, ఆహార భద్రత అనే అంశాలపై విద్యార్థులు వివిధ ప్రదర్శనలు నిర్వహించారు. జిల్లాలోని 15 పాఠశాలల నుంచి సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విజేతలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. వీరిని డీఈవో రవీందర్‌రెడ్డి అభినందించారు. న్యాయ నిర్ణేతలుగా రాష్ట్ర రిసోర్స్ పర్సన్ నారాయణవర్మ వ్యవహరించారు.

మద్యం పట్టివేత

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ద్యాగవాడ చౌరస్తా వద్ద ధర్మాన ఇంట్లో మద్యం బాటిళ్లు శనివారం పట్టుకున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు. పక్కా సమాచారంతో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు అతని ఇంట్లో తనిఖీ చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన 62 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

రూ.80 వేల నగదు పట్టివేత



పట్టుబడిన నగదుతో పోలీసులు

వాంకిడి: ఎన్నికల నేపథ్యంలో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.80,160 నగదు పట్టుబడినట్లు ఎస్సై డీ సాగర్ తెలిపారు. మండలంలోని ఇందాని ఎక్స్‌రోడ్డు వద్ద శనివా రం తనిఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఆసిఫాబాద్‌కు చెందిన తక్కల హరీశ్ ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు తరలిస్తుండగా పట్టుకుని సీజ్ చేసినట్లు తెలిపారు.

తృటిలో తప్పిన ప్రమాదం

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని పెట్రోల్ పంపు ఏరియాలో (క్రాస్‌రోడ్డు–కాగజ్‌నగర్) ప్రధాన రహదారిపై శనివారం ఓ ట్రక్కు కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఇటీవల కొనుగోలు చేసిన కారు డ్యామేజ్ అవడంతో యజమాని పోలీసులకు సమాచారం అందించారు. కాగజ్‌నగర్–క్రాస్ రోడ్డు ప్రధాన రహదారిపై తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొంతమంది భారీ వాహనాలను రోడ్డుకు ఇరువైపులా నిలిపివేయగా ట్రాఫిక్ సమస్య కూడా పెరుగుతోంది. ప్రధాన రహదారిపై ప్రమాదాలను నివారించేందుకు ఆర్టీవో అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నేతలు

శ్రీరాంపూర్: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ నేతలు ఆర్కే 5గని మేనేజర్ అబ్దుల్ ఖాదీర్‌కు శనివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గని ఫిట్ సెక్రెటరీ గునిగంటి నర్సింహారావు మాట్లాడుతూ.. గనిలో మ్యాన్ రైడింగ్ సమయాన్ని కార్మికులకు అనుకూలంగా ఏర్పాటు చేయాలన్నారు. గనిలో ఉపయోగిస్తున్న ఎస్‌డీఎల్స్ యంత్రాలు కాలం చెల్లాయని తెలిపారు. దీంతో తరచూ మొరాయిస్తున్నాయని, కార్మికులు శ్రమపడాల్సి వస్తుందన్నారు. ఇంకా ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు గట్టు బాలయ్య, పెసర కొండపృధ్వి పాల్గొన్నారు.

నియోజకవర్గానికో నంబర్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): అసెంబ్లీ ని యోజకవర్గాలను సాధారణంగా పేర్లతో పి లుస్తాం. కానీ సాంకేతికపరంగానే కాకుండా ఎన్నికల సంఘం విధుల్లో భాగంగా ప్రతీ నియోజకవర్గానికి ఒక్కో నంబర్ కేటాయించింది. ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గాలైన సిర్పూర్ 001, చెన్నూర్ 002, బెల్లంపల్లి 003, మంచిర్యాల 004, కుమురంభీం ఆసిఫాబాద్ 005, ఆదిలాబాద్ 006, బోథ్ 007, నిర్మల్ 008, ముథోల్ 009, ఖానాపూర్ 010 నంబర్‌తో ఉన్నాయి.

ఓటు వినియోగంపై వినూత్న ప్రచారం



అందె సంతోశ్



ద్విచక్ర వాహనంపై ప్రచారం బోర్డు

మంచిర్యాలటౌన్: ఓటు హక్కు వినియోగంపై మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్డుకు చెందిన అందె సంతోశ్ బాబు వినూత్నంగా ప్రచారం నిర్వహిస్తున్నాడు. "నా ఓటును అమ్ముకుంటాను.. నాకు సిగ్గులేదు, ఉద్యోగాలు, ఉపాధి అవసరం లేదు, మద్యానికి బిర్యాని, డబ్బులకు అమ్ముడుపోతాను, నాకు సిగ్గులేదు" అని ఓ బోర్డును తయారు చేసి తన ద్విచక్ర వాహనం వెనుకాల అమర్చాడు. వాహనంపైనే పట్టణంలో పర్యటిస్తున్నాడు. ప్రజలు పాజిటివ్‌గా చెబితే అర్థం చేసుకోవడం లేదని, ఇలా నెగెటివ్‌గా ప్రచారం చేస్తున్నట్లు సంతోశ్‌బాబు చెప్పాడు. జాతీయ దారిద్ర్య రేఖ దిగువ ప్రజల హక్కుల పోరాట సమితిని ఇటీవల స్థాపించిన ఆయన ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిపాడు.

ఎంపీ వెంకటేష్ నేత వాహనం తనిఖీ



ఇందారం చెక్‌పోస్టు వద్ద వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్సై ఉపేందర్‌రావు, పక్కన ఎంపీ వెంకటేశ్‌నేత

జైపూర్: మండలంలోని ఇందారం గోదావరిబ్రిడ్జి సమీపంలో పెద్దపల్లి–మంచిర్యాల జిల్లా సరిహద్దు చెక్‌పోస్టు వద్ద శనివారం పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేష్‌నేత వాహనాన్ని పోలీసులు తనిఖీ చేశారు. ఎంపీ గోదావరిఖని నుంచి మంచిర్యాలకు వెళ్తుండగా ఎన్నికల నియమావళిలో భాగంగా జైపూర్ ఎస్సై ఉపేందర్‌రావు తనిఖీ నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిరంతరం నిఘా ఏర్పాటు చేసి వాహనాలు తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. అదనపు ఎస్సై నాగరాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరనున్న సర్పంచులు

జైపూర్: మండలంలోని అధికార పార్టీ బీఆర్ఎస్ చెందిన సర్పంచులు కాంగ్రెస్‌లో చేరికకు రంగం సిద్ధం చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. మండలంలోని 20 గ్రామాల్లో 10 నుంచి 12 మంది సర్పంచులు పార్టీని వీడనున్నట్లు తెలుస్తోంది. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులను పట్టించుకోకపోవడం, ఒంటెత్తు పోకడలతో ఖాతరు చేయకపోవడంతో పార్టీని వీడుతున్నట్లు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. మాజీ ఎంపీ గడ్డం వివేక్ బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో మండల ము ఖ్యనేతలు కొందరు అధికార బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరికకు ఆసక్తి చూపిస్తున్నట్లుగా తెలుస్తోంది. గత ఎమ్మెల్యే ఎన్నికల్లో సుమన్ తొలిసారి నియోజకవర్గ పర్యటనలో చోటుచేసుకున్న పెట్రోల్ మంటల దాడిలో గాయపడ్డ ప్రజాప్రతినిధులు, నాయకులు తీవ్ర నిరాశలో ఉన్నారని, వారూ కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది.

కాంగ్రెస్ పార్టీలోకి ప్రజాప్రతినిధులు?

భీమారం: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారని సమాచారం. మాజీ ఎంపీ గడ్డం వివేక్ బీజేపీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో రాజకీయాలు వేడెక్కాయి. మండలంలో 11మంది సర్పంచులు, ఇద్దరు ఎంపీటీసీలు ఉండగా బీఆర్ఎస్‌లో కొనసాగుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తగిన ప్రాధాన్యం కల్పించడం లేదని కొందరు అసంతృప్తితో ఉన్నారు. కాంగ్రెస్ నాయకుడు వివేక్‌తో ఉండాలని ఒక నిర్ణయానికి వచ్చి ఒకట్రెండు రోజుల్లో పార్టీని వీడనున్నట్లు తెలిసింది.

'ఎమ్మెల్యే చిన్నయ్యకు వ్యతిరేకంగా ప్రచారానికి సిద్ధం'

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఎన్నికల్లో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు వ్యతిరేకంగా ప్రచారం చేయడానికి సిద్ధంగా ఉన్నానని ఆరిజిన్ డెయిరీ నిర్వాహకురాలు బోడపాటి శేజల్ పేర్కొన్నారు. శనివారం ఆమె ఓ వీడియోను విడుదల చేశారు. ఎన్నికల్లో లబ్ధి పొందడానికి ఎమ్మెల్యే చిన్నయ్య తనకు అండగా ఉన్న అధికారులను బదిలీ కాకుండా చూసుకున్నారని తెలిపారు. ఆర్డీఓ కొంతకాలం నుంచి జిల్లాలో పని చేసినప్పటికీ బెల్లంపల్లికి రప్పించుకున్నారని తెలిపారు. ఆయనపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో బదిలీ వేటు పడిందని తెలిపారు. మహిళలపై వేధింపులు, అవినీతి, అక్రమాలకు పాల్పడిన చిన్నయ్యను అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించాలని ఆమె ఓటర్లకు పిలుపునిచ్చారు.

సమష్టి కృషితోనే ప్రగతి



పురస్కారాలు తీసుకున్న వారితో ఆర్ఎం, అధికారులు

- ఆర్టీసీ ఆర్ఎం సోలోమన్

ఆదిలాబాద్: ఆర్టీసీ ఉద్యోగులంతా సమష్టి కృషితో ముందుకు సాగినప్పుడే ప్రగతి సాధ్యమవుతుందని ఆదిలాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోలోమన్ అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన రీజినల్ లెవెల్ ప్రగతి చక్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగులు సేవా దృక్పథంతో ఆలోచిస్తూ నిరంతరం అంకితభావంతో పని చేయాలన్నారు. సంస్థను లాభాల బాటలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అత్యుత్తమ సేవలు అందించిన 28 మంది ఉద్యోగులకు పురస్కారాలతో పాటు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. అలాగే రీజియన్ పరిధిలో ఆదిలాబాద్ డిపో అగ్రస్థానంలో నిలవగా, డీఎం కల్పన ప్రోత్సాహకాన్ని అందుకున్నారు. డిప్యూటీ ఆర్ఎంలు ప్రణీత్, ప్రవీణ్, ఆసిఫాబాద్ డిపో మేనేజర్ శ్రీధర్ ఉన్నారు.

తలనొప్పి భరించలేక యువతి ఆత్మహత్య



వైష్ణవి మృతదేహం

సారంగపూర్: మండలంలోని పొట్య గ్రామానికి చెందిన అలుగొండ వైష్ణవి(17) తలనొప్పి బాధ భరించలేక ఆత్మహత్య చేసుకుందని సారంగాపూర్ ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. కొన్నేళ్లుగా సమస్యతో బాధపడుతోంది. చికిత్స చేయించుకున్నా నయం కాకపోవడం, ఖరీదైన చికిత్స చేయించుకునే స్థోమత లేకపోవడంతో శనివారం ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వైష్ణవి తండ్రి దత్తన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు మృతి



లక్ష్మణ్ (ఫైల్)

నేరడిగొండ: అప్పు తీర్చేమార్గం లేక రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌వో మారుతి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బొండిడి గ్రామాని కి చెందిన జాదవ్ లక్ష్మణ్ (48) గతేడాది ప్రైవేట్‌గా దాదాపు రూ.3లక్షల వరకు అప్పు చేశాడు. పంట సాగుతో పాటు కొడుకు పెళ్లి, అలాగే ఇంటిని నిర్మించుకున్నాడు. తనుకున్న నాలుగున్నర ఎకరాల్లో సాగు చేసిన సోయా, మక్క పంటలు సరిగా పండకపోవడంతో చేసిన అప్పు తీర్చలేనని మనస్తాపం చెంది గత నెల 20న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో వివరించారు.